www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 27 జూన్ 2025

5

ఏలూరు



ఎస్‌సి బాలుర హాస్టల్లో ప్రవేశాలు

పోలవరం :పోలవరం ఎస్‌సి బాలుర వసతి గృహంలో చేరాలనుకునే విద్యార్థులకు ప్రవేశాలు జరుగుతున్నాయని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.విజయకుమార్ తెలిపారు. వసతి గృహంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు బాలురను చేర్చుకుంటామని చెప్పారు. విశాలమైన భవంతిలో అన్ని సౌకర్యాలతో వసతి గృహం ఉందని వివరించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటామని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. పోలవరం పరిసర ప్రాంతాలతో పాటు ఏ మండలానికి చెందిన విద్యార్థులైనా చేరవచ్చన్నారు. వసతి గృహంలో చేరాలనుకునే విద్యార్థులు విద్యార్థ సర్టిఫికెట్స్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డులు, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 8985220507, 7893253967 సంప్రదించాలని తెలిపారు.

మాది యుపి స్కూల్‌గానే ఉంచండి

10 రోజులుగా కోడూరు స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన

టీసీలు తీసుకునేందుకు నిరాకరణ

స్పందించని పాలకులు, ఉన్నతాధికారులు




పైతరగతులకు చెందిన 20 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాల విద్య వ్యవస్థలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల ఫలితంగా మండలంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా డీగ్రేడ్ అయిన మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలో తొమ్మిది యుపి పాఠశాలలు డీ గ్రేడ్ అయ్యాయి. ఆ పాఠశాలల్లో విద్యార్థులు చాలా దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్లి చదువుకోవాలంటే పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలోని యుపి పాఠశాలలన్నీ బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారి 6, 7, 8 తరగతులు రద్దు కావడంతో ఆ పాఠశాలల విద్యార్థులు దూర ప్రాంతాల్లో ఉన్న హైస్కూల్స్‌కు వెళ్లి చదువుకోవడం కష్టతరంగా మారింది. కోడూరులోని యుపి స్కూల్ విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ పాఠశాలలో 6, 7, 8 తరగతులకు చెందిన 20 మంది విద్యార్థులు ఉన్నారు. గత 40 సంవత్సరాల నుండి కోడూరులో యుపి స్కూల్ ఉంది. ఈ క్రమంలో బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా డీగ్రేడ్ చేయడంతో 20 మంది విద్యార్థులు సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాలపర్రు లేదా ముదినేపల్లి హైస్కూళ్లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అదీ జాతీయ రహదారి వెంబడి రాకపోకలు సాగించాల్సి రావడంతో తమ పిల్లలను అంతదూరం పంపేందుకు తల్లిదండ్రులు సైతం వెనుకాడుతున్నారు. దీనిపై పది రోజులుగా తమ పాఠశాలను యుపి పాఠశాలగానే కొనసాగించాలని కోరుతూ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనబాట పట్టారు. తమకు తెలియకుండానే మారుమూల గ్రామమైన కోడూరు యుపి పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చడం ఏమిటని విద్యాశాఖాధికారులను నిలదీస్తున్నారు. ఇటీవల గ్రామస్తులు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌కు సైతం వినతిపత్రం అందించారు. ఈ నెల 12 నుంచి ఆ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఆరో తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థులతోపాటు 7, 8వ తరగతి విద్యార్థులు మొత్తం 20 మంది ప్రతిరోజూ పాఠశాలకు వస్తూనే ఉన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఉపాధ్యాయులు హాజరు వేస్తూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. పై తరగతులు కొనసాగించాలా లేదా, అనేది విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక ఉపాధ్యాయులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. పాఠశాల తెరిచి రెండు వారాలైనప్పటికీ ఇంకా గందరగోళ పరిస్థితి కొనసాగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో మొన్నటి వరకు ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఎంటిఎస్ ఉపాధ్యాయిని పని చేసేవారు. ఎంటిఎస్ ఉపాధ్యాయిని ఇటీవల బదిలీల్లో వేరే పాఠశాలకు బదిలీ అఆయ్యరు. ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులే ఎనిమిది తరగతులకు పాఠాలు బోధిస్తుండటం గమనార్హం. దీనిపై మండల, జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం 6, 7, 8 తరగతుల విద్యార్థులకు పుస్తకాలు ఇంకా సరఫరా చేయలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కోడూరు యుపి పాఠశాలను యథాతథంగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మా స్కూలు మాకే కావాలి



కొడాలి ఝాన్సీలక్ష్మి, ఎస్ఎంసి సభ్యురాలు

గత 40 ఏళ్లుగా ఉన్న మా యుపి స్కూల్ మాకే కావాలి. యుపి స్కూల్‌ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలగా మార్చడం తగదు. మా స్కూలును గతంలో ఉన్న మాదిరిగానే యుపి స్కూల్‌గా కొనసాగించాలి.

అంత దూరం పిల్లల్ని పంపలేం



వంకా ప్రమోద్, విద్యార్థి తండ్రి, ఆటో డ్రైవర్

మా పిల్లలను పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు పంపలేం. అవసరమైతే మా పిల్లలను బడి మాన్పించేస్తాం. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. బస్సు, ఆటో సౌకర్యం లేదు. దీంతో పిల్లలు ఎటూ వెళ్లలేని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో పిల్లలను అంత దూరం పంపలేం.

మా స్కూల్లోనే చదువుకుంటా



వినయకుమార్, 8వ తరగతి విద్యార్థి

నేను మా స్కూల్‌లోనే చదువుకుంటా. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లలేను. రహదారి సౌకర్యం సరిగా లేదు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అంతదూరం నేను వెళ్లలేను. మా ఊరిలోనే చదువుకుంటా.

అంత దూరం వెళ్లాలంటే భయమేస్తోంది



శ్రీనిధి, ఏడో తరగతి విద్యార్థిని

నేను అంత దూరం వెళ్లి చదువుకోవాలంటే భయమేస్తోంది. జాతీయ రహదారిని దాటుకుని పది కిలోమీటర్లు వెళ్లాలంటే భయంగా ఉంది. మా గ్రామంలో 8వ తరగతి వరకు స్కూలును కొనసాగించాలి.

ఒడిదుడుకుల్లో ఆక్వారంగం..!

తగ్గని సీడ్, ఫీడ్ ధరలు.. దిగజారిన రొయ్య ధర

వాతావరణ మార్పులతో నష్టాల ఊబిలో రైతులు



ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా హబ్‌గా పేరు ప్రఖ్యాతలుగాంచింది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా. అటువంటి జిల్లాలో రొయ్యలు, చేపల రైతులు ఈ ఏడాది నష్టాల ఊబిలో కూరుకుపోయారు. సాగు వ్యయంలో 50 శాతానికిపైగా మేతలకే అవుతోంది. వాటి ధరలు తగ్గించాలని రైతులు కోరుతున్న ప్రభుత్వం నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. అదే క్రమంలో అమెరికా సుంకాల ప్రభావం ఆక్వా మార్కెట్‌పై పడింది. రొయ్యకు సరైన ధర లేకపోవడంతోపాటు ఎగుమతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హేచరీల స్థాయిలో వైరస్ సమస్య కారణంగా రొయ్య సీడ్ చెరువులో వేసిన 25 రోజుల్లోనే చనిపోవడం తీవ్ర నష్టాలకు కారణమైంది. ప్రతికూల వాతావరణం, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏడాది పొడవునా ఇబ్బందులు తప్పడం లేదు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రొయ్యల సాగు చాలా విస్తృతంగా ఉంది. రాష్ట్రంలో ఆక్వా (రొయ్యలు, చేపల) చెరువులు 5.75 లక్షల ఎకరాల్లో ఉండగా, అందులో 2.63 లక్షల ఎకరాలు పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2.63 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. ఈ ఏడాది మొదటి పదినెలల్లో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. దీంతో దిగుబడితోపాటు ఆదాయం కూడా పడిపోయింది. దీనికితోడు ఈ ఏడాది రొయ్య ధరలు గణనీయంగా పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వేసవిలో వాతావరణంలో మార్పులు రావడంతో ఈ ప్రాంతంలో రొయ్యల చెరువుల్లో ఒక్కసారిగా వైరస్ విజృంభించింది. వేలాది ఎకరాల్లో తెల్లమచ్చ వైరస్ సోకింది. ఆక్సిజన్ అందక చేపలు తేలిపోతున్నాయి. దీంతో రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారు.

వంద కౌంట్ ధర రూ.250 ఉండాల్సి ఉండగా దళారులు రూ.220కు కొనుగోలు చేస్తున్నారు. కిలో రొయ్యకు రూ.30 నుంచి రూ.40 వరకూ దండుకుంటున్నారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లకు కోట్లాది రూపాయలు సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వాలు రైతుల పట్ల మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. నాణ్యమైన సీడ్ దొరకకపోవడం, వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ వంటి వాటి వల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తాజాగా వాతావరణం చల్లబడటంతో ఆక్సిజన్ లోపంతో రొయ్యలు ఆక్సిజన్ అందక తేలిపోతుండటంతో రైతులు నష్టపోతున్నారు.

తగ్గని విద్యుత్ ఛార్జీల భారం

గుదిబండగా మారిన విద్యుత్ ఛార్జీల భారాన్ని కూటమి ప్రభుత్వం తగ్గిస్తే ఆక్వా రంగం కోలుకుంటుందని రైతులు చెబుతున్నారు. ఏరియేటర్లతో చేపలు, రొయ్యలను బతికించుకునేందుకు ప్రభుత్వం విద్యుత్ రాయితీని వెంటనే అమలు చేయాలని కోరుతున్నారు.


రొయ్యల ధరలు

20 కౌంట్	రూ.500
25 కౌంట్	రూ.500
30 కౌంట్	రూ.435
40 కౌంట్	రూ.355
45 కౌంట్	రూ.330
50 కౌంట్	రూ.320
60 కౌంట్	రూ.300
70 కౌంట్	రూ.270
80 కౌంట్	రూ.250
90 కౌంట్	రూ.230
100 కౌంట్	రూ.220

డ్రెయిన్, తారురోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా పరిషత్ ఆవరణలో జెడ్‌పి నిధులు రూ.55 లక్షలతో డ్రెయిన్లు, తారురోడ్డు నిర్మాణాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం శంకుస్థాపన చేశారు. తొలుత జిల్లా పరిషత్ ఆవరణలోని జాతీయ నాయకుల విగ్రహాలకు రూ.ఐదు లక్షలతో ఏర్పాటు చేసిన లాడర్స్‌ను ఆయన ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి ఏర్పాటు చేసిన లాడర్‌ను కూడా ప్రారంభించి, ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబూజగజ్జీవన్‌రామ్, మదర్ థెరిస్సా, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు జాతీయ నాయకుల విగ్రహాల వద్దకు వెళ్లి సత్కరించుకునేందుకు రెయిలింగ్‌తో కూడిన మెట్లను ఏర్పాటు అభినందనీయమని మంత్రి పార్థసారథి అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పరిపాలన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీరామకృష్ణ, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, ఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, పలువురు జెడ్‌పిటిసిలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

కలెక్టర్ వెట్రిసెల్వి

పెరేడ్ గ్రౌండ్స్ నుంచి భారీ ర్యాలీ, మానవహారం



అవగాహనా ర్యాలీలో కలెక్టర్, జెసి, ఎస్‌పి, ఎంఎల్ఎ, తదితరులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

డ్రగ్స్ రహిత జిల్లాగా ఉంచేందుకు పలు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాల నివారణకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో గంజాయి, మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై పలు పాఠశాలల విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుండి ఫైర్ స్టేషన్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌రహిత జిల్లాగా ఏలూరును నిలుపుతామని అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. రంగునీటిలో అరచేతిని పెట్టి ఫ్లెక్సీ బ్యానర్‌పై అందరూ ముద్ర వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 12 గంజాయి హాట్‌స్పాట్లను గుర్తించి ఆ ప్రాంతంలో అవగాహనా కార్యక్రమాలు, విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాల నుండి విముక్తి పొందేందుకు జిల్లాలో రెండు డి.ఆడిక్షన్ సెంటర్లను కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. నాటుసారా నియంత్రణలో భాగంగా 141 గ్రామాలను గుర్తించి గ్రామ సభలు నిర్వహించి వారిలో అవగాహన, చైతన్యం తీసుకొచ్చినట్లు వివరించారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాదారులపై జిల్లాలో 12 కేసులు నమోదుచేసి 43 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు వివరించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ డ్రగ్స్‌రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుందన్నారు. ఏలూరు నియోజకవర్గాన్ని డ్రగ్స్ రహిత నియోజకవర్గంగా ఆదర్శవంతంగా నిలుపుతామన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్ కుమార్, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, ఆర్‌ఐఒ యోహాన్, విభిన్న ప్రతిభావంతులశాఖ ఎడి బి.రామ్‌కుమార్, డిటిసి డిఎస్‌పి ప్రసాద్, పలువురు సిఐలు, ఎస్ఐలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మాపై కక్షసాధింపు చర్యలు దారుణం

తరుగుమూల ఇళ్ల స్థలాల లబ్ధిదారులు

కొనసాగిన ఆందోళన



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - మండవల్లి

ఇళ్ల స్థలాల్లో ఇల్లు నిర్మించుకుందామని ఎన్నో కలలు కని భర్తలను కోల్పోయి అనాథలుగా ఒంటరిగా మిగిలిపోయిన మాపై అధికారులు జాలి చూపకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరి కాదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం నిలుపుదల చేసి స్థలాలు తమకే కేటాయించాలని కోరుతూ తరుగుమూల ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళన గురువారం నాలుగో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల్లో ఇల్లు నిర్మించుకుందామని ఎన్నో కలలు కని సుమారు 26 కుటుంబాల్లో భర్తలను కోల్పోయామని, తల్లిదండ్రులను కోల్పోయి దిక్కులేని స్థితిలో మరో ఐదు కుటుంబాలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ధర్నాలో పాల్గొన్న రామారావు గుండెపోటుతో మరణించినా జాలి కలగడం లేదా.. ఇంకా ఎంతమందిని పోగొట్టుకుంటే ఇళ్ల స్థలాలు మాకు కేటాయిస్తారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి అధికారులు, రాజకీయ లబ్ధి కోసం నాయకులు పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, ఇంకా ఎన్నేళ్లు పోరాటం చేస్తే మీకు దయ కలుగుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్థలాలపై పోరాటం చేసి ఆర్థికంగా, మానసికంగా ఎంతో నష్టపోయామని, ఇంకా నష్టపోయేందుకు తమ దగ్గర ఓపిక లేదంటూ నిట్టూరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం నిలుపుదల చేసి స్థలాలను మెరక చేసి ఇల్లు నిర్మించుకునేలా చేయాలని వారు కోరుతున్నారు. లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేసి ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బుద్దుల రాముడు, గిరిజాల పద్మ, సుజాత, ధనలక్ష్మి, జయ, వనజ, అలివేలు మంగతాయారు, సింహాచలం, పల్లె రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

అభివృద్ధి పనులపై సమాచారం ఇవ్వడంలేదని కౌన్సిలర్ల ఆవేదన

అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

నూజివీడు టౌన్ :పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా కొనసాగింది. పట్టణ పరిధిలోని 32 వార్డుల్లో నిర్వహించే అభివృద్ధి పనులపై సంబంధిత వార్డు కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడం లేదంటూ కౌన్సిల్ సభ్యులందరూ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు శీలం రాము, నౌడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ తమ వార్డుల్లో నిర్వహించే అభివృద్ధి పనులపై ఎందుకు సమాచారం ఇవ్వరనే అంశాన్ని లేవనెత్తగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ స్పందిస్తూ పట్టణంలో నిర్వహించే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఆయా వార్డు కౌన్సిల్ సభ్యులకు తప్పనిసరిగా తెలియజేయాలని చెప్పడంతో వాగ్వివాదం సద్దుమణిగింది. ప్రస్తుతం పట్టణంలో చేపట్టిన డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలపై చర్చించారు. పట్టణంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా పరిణమించాయని, వాటిని తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ వంద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇనుప స్తంభాలు తొలగించిన స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసే ప్రక్రియ సంబంధిత అధికారుల పర్యవేక్షణలో కొనసాగాలన్నారు. పట్టణ పరిధిలో ఉన్న రోడ్లు, డ్రెయినేజీల అధ్వానంగా ఉందన్నారు. అవసరమైనచోట కల్వర్టులు నిర్మించి, పైపులు ఏర్పాటు చేయడం ద్వారా మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు డబుల్ స్టాండర్డ్స్ ఉంటాయా అని ప్రశ్నించారు. సుమారు 160 ఎకరాల మేర రెవెన్యూ శాఖాధికారులు సరైన రికార్డులు సమర్పించకపోవడంతో వృథాగా ఉందన్నారు. ఆ ప్రాంతంలో పేదలు ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక బృందంతో సర్వే చేసి అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు స్పందించి ఆ స్థలానికి సంబంధించి పూర్తి రికార్డులను ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ దేవాదాయ శాఖ అధికారులు తీసుకునే నిర్ణయాలు కౌన్సిల్ సభ్యులకు తెలియపరచటం సత్సంప్రదాయంగా గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ కుమార్, ప్రసాదరావు, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా తాటిచెట్లు

తొలగించాలని మహిళల ఆందోళన



ఆర్అండ్‌బి రహదారిపై ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రోడ్డుకు అడ్డంగా వేసిన తాటిచెట్టు తొలగించాలని కోరుతూ మండలంలోని బర్రెవారిగూడెం గ్రామానికి చెందిన మహిళలు ఆర్అండ్‌బి రోడ్డుపై గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలం నుంచి నడిచే రోడ్డు మార్గంలో కొందరు వ్యక్తులు తాటిచెట్లు, ముళ్లకంప వేసి మూసి వేశారని చెప్పారు. తాటిచెట్లు, కంచె వేసిన వారిని కఠినంగా శిక్షించాలని, తాటిచెట్లు, కంచె తొలగించాలని కోరారు. బర్రెవారిగూడెంలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా రోడ్డు మార్గం మూసివేయడంతో బయటకు వెళ్లే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై గత 40 సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు మూసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధింత అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. ఆందోళనతో చాలా సేపు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

టీచర్ల పోస్టులను భర్తీ చేయాలి

స్థానిక నిరుద్యోగులతో విద్యా వాలంటీర్లను నియమించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు

కుక్కునూరు మండలంలోని సర్కారు బడులు సమస్యలకు నిలయాలుగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొలికపోగు లెనిన్ విమర్శించారు. ఏలూరులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా కుక్కునూరు మండలంలో సర్కారు బడుల్లో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తుందని వెల్లడించారు. ఈ ఏడాది పాఠశాలల ప్రారంభంలోనే మండలంలోని పలు పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు బదిలీపై వెళ్లినా తిరిగి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో విద్యాశాఖ ఎందుకు అలసత్వం వహిస్తుందని ప్రశ్నించారు. కుక్కునూరు మండలంలో ఉన్న 41 ప్రభుత్వ పాఠశాల్లో 114 మంది టీచర్ల పోస్టులు ఉండగా రెగ్యులర్ టీచర్లు 20 మంది, డిప్యూటేషన్‌పై మరో 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 77 టీచర్ల పోస్టులను తక్షణమే అధికారులు భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలోని రాయిగూడెం, ఉప్పేరు, చీరవల్లి, రామసింగారం సెంటర్లలో ఉన్న నాలుగు మోడల్ పాఠశాలల్లో 26 మంది టీచర్లకు కేవలం ఎనిమిది మంది టీచర్లతోనే పిల్లల చదువులు సాగుతున్నాయని తెలిపారు. కొన్ని చోట్ల ఒక్క టీచర్‌తోనే పాఠశాల కొనసాగడం దయనీయమన్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో వసతులు లేక పిల్లలు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత ఉండటంతో తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. విద్యాశాఖ తక్షణమే ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని, ఆలస్యమయ్యేలా ఉంటే అప్పటివరకు స్థానిక అర్హత ఉన్న స్థానిక నిరుద్యోగులతో విద్యా వాలంటీర్లను నియమించి పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మనోజ్, వంశీ, రాజబాబు, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక..

వివాహిత ఆత్మహత్యాయత్నం

కొన్ని నెలల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భార్యాభర్తల మధ్య వివాదం నేపథ్యంలో ఒంటరిగా ఉంటున్న వివాహిత మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన ఏలూరులోని సబ్ జైలు సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని బీడీ కాలనీకి చెందిన లావేటి సోమేశ్వరరావుకు, మోహనమ్మకు 2024 ఆగస్టు నెలలో వివాహమైంది. కొంతకాలం వీరి కాపురం సజావుగానే సాగింది. అనంతరం భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. భర్తపై అనుమానంతో భార్య అతడిని అనుమానించడంతో వారి మధ్య విభేదాలు మొదలయ్యాయి. భార్యాభర్తలకు మహిళా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది దాదాపు ఐదు మార్లు కౌన్సెలింగ్ చేశారు. కౌన్సెలింగ్ చేసిన ప్రతిసారి కూడా తాము సజావుగా కాపురం చేసుకుంటామని చెప్పి వెళ్లి మళ్లీ గొడవలు పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన మోహనమ్మ మళ్లీ మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. అతనికి 41 నోటీసు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన మోహనమ్మ సబ్‌జైలు సమీపంలోనే నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన పోలీసులు వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం రాత్రి ఆసుపత్రి నుంచి ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయిన ఆమె గురువారం సబ్ జైలు సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెకు పెట్రోల్ ఎక్కడ నుంచి వచ్చింది.. ఆమె ఎందుకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని డిఎస్‌పి తెలిపారు. భర్తతో విబేధాల కారణంగా ఆమె ఒంటరిగా ఉండడం, మొదటి నుంచి వసతి గృహాల్లో పెరిగి ఒంటరిగా ఉండడం వల్ల ఆమె మానసిక స్థితి కొంత దెబ్బతిందని, దీంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని డిఎస్‌పి చెప్పారు. కాలిన గాయాలు ఎక్కువ కావడంతో న్యాయమూర్తితో డీడీ కూడా చేయించామని తెలిపారు. ప్రస్తుతం ఆమె ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుందని, పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఈ కేసులో పూర్తి విచారణ కొనసాగుతుందని డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగమణి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా 2047 విజన్ ప్రణాళికలు

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాల సాధనలో భాగంగా ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా నూజివీడు నియోజకవర్గ విజన్ డెవలప్‌మెంట్ ప్లాన్ను రూపొందించినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. గురువారం సాయంత్రం నూజివీడు రోటరీ కళ్యాణ మండపంలో జిల్లా, నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కింద నూజివీడు నియోజకవర్గ విజన్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఆవిష్కరణ-చర్చ- సమాలోచన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నూజివీడు నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధిప్రణాళికలు సంబంధించి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డిఎఫ్ఒ శుభం, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదరనాయుడు, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, గొర్రెల, మేకల కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ సూర్యకుమారి, నూజివీడు సిపిఒ నోడల్ ఆఫీసర్, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, ఎల్‌డిఎంఒ నీలాద్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఎన్‌జిఒ నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా కలెక్టర్‌గా వచ్చి సంవత్సర కాలం పూర్తి చేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు గురువారం ఆమె కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్‌గా ఈ సంవత్సర కాలంలో ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కరించారని, జిల్లాను అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ అందరి సహాయ సహకారాలు ఎప్పుడూ జిల్లా యంత్రాంగానికి అందించి ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ పక్షాన పేద విద్యార్థులకు 500 నోట్సు పుస్తకాలు కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఏలూరు తాలూకా అధ్యక్షుడు గోన్నూరి శ్రీధర్‌రాజు, నాయకులు మోహన్, బేగ్, గంగాధర్, రమేష్, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు


దుస్తులు, బ్యాగులు అందిస్తున్న టిడిపి నేతలు

ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకంలో భాగంగా ఏకరూప దుస్తులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు డి.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కొండేటి బాబి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాంతం, కులం, మతం, వర్గం అనే భేదాలు ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ నక్క మోహన్, టిడిపి నాయకులు తులిమెల్లి రంగారావు, దేవినేని ప్రసాద్, ఉపాధ్యాయులు గంగుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరులోని డ్రెయినేజీల్లో పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. డ్రెయినేజీలు పూడుకుపోయి వర్షపు నీరు బయటకు వెళ్లటం లేదు. వర్షపు నీరంతా నివాసాల మధ్యనే నిల్వ ఉంటుంది. ఈ విషయం కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో డ్రెయినేజీల్లో పూడికతీత పనులను తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు, టిడిపి పెదగొన్నూరు అధ్యక్షులు యార్లగడ్డ గంగయ్య ఆర్థిక సహాయంతో చేయించారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిడిపి నాయకులు దాసరి శ్రీను, కాసాని బాలయేసు, తదితరులు పాల్గొన్నారు.

కచ్చా డ్రెయిన్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గ్రామానికి డ్రెయిన్ల కష్టాలు కొంతవరకు తీరుతున్నాయి. ఏటిగట్టు రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ నిర్మించాలని ఏళ్ల తరబడి ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. రూ.25 లక్షల మండల పరిషత్ నిధులతో జగన్నాథపేట వెనుకవైపు నుంచి నంబూరు శ్రీను ఇంటి ముందు వరకు కచ్చా డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణాన్ని పోలవరం ఎంపిడిఒ శ్రీనివాస్‌బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు మాజీ ఉప సర్పంచి మంగిన వెంకటరమణ (కొండ), పొడుం శ్యామ్‌కుమార్, పట్నాల నారాయణరావు, ఆకుల రాజా, పోతుల శ్రీను తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో టిడిపి నేత మృతి

ప్రజాశక్తి - కలిదిండి

ప్రముఖ చేపల వ్యాపారి, టిడిపి నాయకుడు మహ్మద్ ఉమర్(63) గుండెపోటుతో మృతి చెందారు. ఉమర్ చేప పిల్లల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. చేపల ఉమర్‌గా గ్రామంలో సుపరిచితులు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉమర్ మృతదేహాన్ని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, నీటి సంఘం అధ్యక్షుడు పేటేటి వెంకట సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ రవికుమార్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లంకా రత్నారావు, స్థానిక గ్రామ ప్రముఖులు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందికి గురువారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం ట్యాబ్‌లను అందించడం ద్వారా లక్ష్యాలు వేగవంతంగా నెరవేరే దిశగా కృషి చేయాలన్నారు.

నేరాలు - ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని అప్సర థియేటర్ సమీపంలో పిలగల రవీంద్ర (20) అనే యువకుడు గురువారం అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడు. ఇటీవల ఓ వివాదంలో ముగ్గురు వ్యక్తులు రవీంద్రపై దాడి చేసి కారం కొట్టి, మిరపకాయలతో చిత్రహింసలు పెట్టి కొట్టడమే కాకుండా మరో వారంలో మళ్లీ కొడతామని వార్నింగ్ ఇచ్చారని మృతుని మేనమామ నెరసు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం టిఫిన్ ఇచ్చేందుకు వెళ్లగా ఉరేసుకుని రవీంద్ర చనిపోయి ఉన్నాడని చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండవల్లి కైకలూరు స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మండవల్లి కైకలూరు రైల్వే స్టేషన్ మధ్యలో గురువారం మధ్యాహ్నం రైల్వే ట్రాక్ దాటుతుండగా కైకలూరు వైపు నుంచి గుడివాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నూతన భవనం.. సమస్యలు స్వాగతం..!

పూర్తికాని నిర్మాణ పనులు
వేధిస్తోన్న తాగునీటి కొరత
గురుకుల పాఠశాల విద్యార్థుల ఇక్కట్లు
ఉన్నతాధికారులు స్పందించాలని
తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి - చింతలపూడి

గోదాము షెడ్డులో నుంచి నూతన భవనంలోకి వచ్చిన చింతలపూడి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఒకపక్క భవనాలు పూర్తికాక, మరోపక్క తాగునీటి సమస్యతో నిత్యం సమస్యలను ఎదుర్కొంటున్నారు. రూ.25 లక్షలతో బోరు, తాగునీటి పైపులు ఏర్పాటు చేయాలని మంజూరు చేసిన నిధులు ఎక్కడ ఖర్చు పెట్టారో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యను సాగిస్తున్నారు. పాఠశాల భవనాలు పూర్తి కాకుండానే పేరు కోసం హడావిడిగా ప్రారంభించారని ప్రజలు చెబుతున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, డార్మెంటరీ భవనాలు పూర్తి కాకపోవటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. అదే విధంగా వంట షెడ్డు లేకపోవటంతో వంట కూడా పాఠశాల భవనంలోనే చేస్తున్న పరిస్థితి నెలకొంది.

మండలంలో 2012లో ప్రారంభించిన గురుకుల పాఠశాల భవనం నేటికీ ఇంకా పూర్తిస్థాయిలో పూర్తి కాలేదు. దీని గురించి పట్టించుకునే నాధుడు లేకపోవడంతో భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కిచెన్, డైనింగ్ హాల్ డార్మెంటరీ భవనాలు ఇంకా పూర్తికాని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులకు కొత్త భవనానికి వచ్చిన అనుభూతి లేకుండా పోతుంది. గతంలో గోదాము షెడ్డులో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు కొత్త భవనంలోకి వచ్చినా ఇబ్బందులు తప్పని పరిస్థితి. నూతన భవన నిర్మాణ పనులను 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున, అప్పటి చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజా, అప్పటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. తామే నిర్మించి, ప్రారంభించామనే పేరు కోసం అప్పటి నాయకుల ఒత్తిడితో పాఠశాల భవనాలు పూర్తి కాకుండానే ప్రారంభించారు. దీంతో మిగతా భవనాల పరిస్థితి ఏంటని ప్రశ్న నెలకొంది. పృటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విద్యార్థుల కష్టాలను చూసి ఆయన ప్రత్యేక దృష్టి సారించి నిధులు తీసుకొచ్చి పాఠశాల భవన నిర్మాణానికి ఎంతగానో కృషి చేశారు. మిగతా భవనాలు పూర్తి చేసే సమయంలో నాయకుల ఒత్తిడి తీసుకురావడంతో అవి పూర్తికాకుండానే హడావిడిగా ప్రారంభించారు. దీంతో ఈ మిగతా భవనాల గురించి పట్టించుకునే నాధుడు లేకుండా పోయారు. విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.


పూర్తిస్థాయిలో నిర్మాణం కాని భవనం

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.25 లక్షలతో పైపులైన్ వేశారు. అయినా ఆ సమస్య పరిష్కారం కాలేదు. విద్యార్థులను తాగునీటి కొరత వేధిస్తూనే ఉంది. రూ.25 లక్షల నిధులు ఏం చేశారో, ఎక్కడ నుంచి ఎక్కడికి పైపులైన్ వేశారో తెలియని పరిస్థితి. రూ.25 లక్షలు ఖర్చు పెట్టినా విద్యార్థులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఒకానొక సమయంలో తాగునీటి ట్యాంకర్ల ద్వారా విద్యార్థులకు నీటిని తీసుకొస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు కొత్త భవనంలోకి వెళ్లామనే ఆశ తప్ప సమస్యలతో ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మిగిలిన భవనాలు కూడా పూర్తి చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం


దూరంగా ఉండాలి
అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనమౌతుందని, మాదక ద్రవ్యాల నివారణకు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నూజివీడులో నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆయన నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని మేటాస్ నర్సింగ్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకున్నా, అమ్మినా నేరమని, అలా పట్టుబడితే ఆరు నెలల నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రమేష్, న్యాయవాదులు ఐ.సత్యప్రకాష్, ఎస్‌కెడి.ప్రసాద్, గోపీనాథ్, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ :ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రీడా విభాగంలోని క్రీడాకారులకు గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను వాడటం వల్ల యువత మేధస్సు నశిస్తుందని, నైపుణ్యతను కోల్పోతారని చెప్పారు. విద్యార్థులతో, అధికారులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ సిహెచ్.సూర్యచక్రవేణి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అశోక్ కుమార్, ప్యానల్ లాయర్లు బి.శ్రీలక్ష్మి, పి.రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సిఐ ఎంవి.సుభాష్, ఎక్సైజ్ ఎస్ఐ జి.వెంకటలక్ష్మి, బార్ అసోసియేషన్ జివిఎస్ఎన్‌మూర్తి, ఉపాధ్యక్షులు మాదేపల్లి నాగులు, అచ్యుత శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.



నూజివీడులో...

జీలుగుమిల్లి :రాష్ట్ర సరిహద్దు గుండా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావు తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణపై నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జాతీయ రహదారి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, సిఐ బి.వెంకటేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్, ఎపిఎం ఝాన్సీ, ఎపిఒ జాన్ వెస్లీ, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు పి.రాము, సత్యనారాయణ, మధు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం :యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో మానవ హారం నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి, మహిళా పోలీసు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గణేష్ సెంటర్‌లో విద్యార్థులు, అధికారులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎన్.నాగరాజు మాట్లాడుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి.చంద్రశేఖర్, ఎంఇఒ జె.సురేష్‌బాబు, ఇఒపిఆర్‌డి జి.సతీష్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు :మాదకద్రవ్యాల వాడకం వల్ల జ్ఞాపక శక్తి తగ్గి, మానసిక ఆందోళనకు గురవుతారని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అన్నారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజు, ఉపాధ్యాయులు దుర్గ, షకీలా, అనురాధ, నాయక్, సురేష్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : విద్యార్థులే లక్ష్యంగా మాదక ద్రవ్యాల వ్యాపారం జరుగుతుందని, విద్యార్థులు మాదక ద్రవ్యాల వ్యసనాలకు లోను కావద్దని ఎస్ఐ వీరభద్రుడు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విజయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో గురువారం వివిధ ప్రయివేట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఎంపిడిఒ రామకృష్ణ, ఆర్ఐ రాజశేఖర్, సచివాలయ ఉద్యోగులు,వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి :మండవల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాలకు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ పవన్‌కాంత్, డి.శివప్రసాద్, సిహెచ్.వెంకటప్పయ్య, జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణంరాజు, నాగ ముని, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మాదక ద్రవ్యాల వినియోగానికి బానిసలై యువత తమ భవిష్యత్తులను చిత్తు చేసుకోవద్దని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగ నివారణలో భాగంగా మత్తు వద్దు ఆరోగ్యం ముద్దు అనే నినాదంతో ఆగిరిపల్లి పురవీధుల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పోలవరం : గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం కెవి.రాఘవన్ మాట్లాడారు. పాఠశాలలో పది మంది విద్యార్థులతో ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్ కోఆర్డినేటర్లుగా ఆదిశేషుడు, జ్యోతి వ్యవహరిస్తారని తెలిపారు.

చింతలపూడి : యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ తెలిపారు. సిఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రమద్వర, కూటమి నాయకులు మాటూరి వెంకటరామయ్య, జనసేన మండలాధ్యక్షులు మధుబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా సుబ్బారావు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా వై.సుబ్బారావు నియమితులయ్యారు. గతంలో ఆయన ఏలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులుగా పని చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. ప్రతి రైతు లాభంలో ఉండేవిధంగా వారి అభ్యున్నతికి తోడ్పడతానని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. చింతలపూడి సబ్ డివిజన్ ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలను అందించనున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. స్థానిక భగత్ సింగ్ కాలనీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురు గిరిజనుల నుంచి పలు పథకాలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురికి మాతృవందన పథకం, పోషకాహార కిట్లు, కిసాన్ బ్యాంక్ ఖాతాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్, పంచాయతీ రాజ్ ఎఇ రామానుజం, ఎపిఒ జాన్ వెస్లీ, హౌసింగ్ ఎఇ ప్రసాద్, అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీ దేవమ్మ, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులకు రూ.ఆరు వేల పెన్షన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వం వృద్ధ కళాకారులకు రూ.ఆరు వేల పెన్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు, సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న కూటమి ప్రభుత్వం కళాకారుల వైపు కన్నెత్తి చూడకపోవడం ఆందోళనకరమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం నడకను నడతను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కంటే వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లేది కళాకారులు మాత్రమే అన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.నాలుగు వేల పెన్షన్ ఏడుపదుల వయస్సు నిండి ఇంటి వద్ద మంచానికే పరిమితమైన వృద్ధ కళాకారులకు, వారి వైద్య ఖర్చులకు కూడా చాలడం లేదని తెలిపారు. కళారంగంపై, కళాకారులపై సమగ్ర అవగాహన కలిగిన చలనచిత్ర కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌లు కళాకారులు పడుతున్న ఆవేదన ఆకలి బాధలను అర్థం చేసుకొని రంగస్థలం కళాకారులకు కనీసం నెలకు రూ.ఆరు వేల పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుని రంగస్థలం వద్ద కళాకారులను ఆదుకోవాలని పేర్కొన్నారు.

ఆధార్ కార్డు లేక.. పెన్షన్ రాక..!

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరం గ్రామం 12వ వార్డుకు చెందిన షేక్ ఖాదర్ శారీరక వికలాంగురాలు. ఆమె రెండు కాళ్లు చచ్చుపడిపోయాయి. 30 ఏళ్ల క్రితం భర్త వదిలివేయడంతో ఆమె మానసిక స్థితి కోల్పోయింది. ట్రీట్‌మెంట్ ఇచ్చిన తర్వాత రెండు కాళ్లు చచ్చిపడిపోయాయి. కదల్లేని స్థితిలో ఉండడంతో ఆమె ఇప్పటివరకు ఆధార్ కార్డు పొందలేకపోయింది. ఇప్పుడు ఆధార్ కార్డు తీసుకుందామంటే ఆమె వయసు 48 సంవత్సరాలు అవడంతో ఆధార్ కార్డు ఇవ్వడానికి కుదరదని ఆధార్ సెంటర్ వారు చెబుతున్నారు. ఆమెకు ఒక ఓటర్ ఐడి కార్డు మాత్రమే ఉంది. దీంతో పెన్షన్, సంక్షేమ పథకాలు కూడా అందట్లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆధార్ కార్డు వచ్చేటట్లు చేయాలని కోరుతుంది.

మండలంలోని కైకరం గ్రామ శివారు లంకపల్లి రోడ్డులో కవురుగిరి సుబ్బారావు, సావిత్రమ్మ దంపతులకు గంగమ్మ అనే వికలాంగురాలు ఉంది. ఆమెకు రెండు కాళ్లు పనిచేయవు. మాటలు కూడా రావు. ఈ రెండు రకాల లోపం ఉన్న ఆధార్ కార్డు లేకపోవడంతో ఆమెకు పెన్షన్, ఇతర సంక్షేమ పథకాలు అందటం లేదు. తల్లిదండ్రులకు కూడా ఆధార్ కార్డు లేదు. దీనికి కారణం వీరు వేరే ఊరి నుంచి ఏళ్ల క్రితం వలస వచ్చారు. వీరి వృత్తి ఎలకలు పట్టడం, పాములు పట్టడం, రోడ్డు మీద ప్లాస్టిక్ ఏరుకుని జీవనం సాగిస్తున్నారు. కదలలేని లేని స్థితిలో ఉన్న గంగమ్మకు ఆధార్ కార్డు కావాలంటే డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ కాని, ఏదో ఒక ప్రూఫ్ ఉండాలని ఆధార్ సెంటర్ వారు చెబుతున్నారు. ఎక్కువ వయసు ఉన్నందున ఆధార్ కార్డు ఇవ్వడానికి తమకు ఎటువంటి పర్మిషన్ లేవని చెబుతున్నారు. వారికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆధార్ కార్డు ఇప్పించి పథకాలు అందేటట్టు చూడాలని విభిన్న ప్రతిభావంతుల సంఘం జిల్లా అధ్యక్షులు కోనే సత్యనారాయణ కోరారు.

రైతుల వద్ద ఉన్న పొగాకుకు వేలం నిర్వహించాలి

టుబాకో బోర్డు పాలకవర్గానికి ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

గతంతో పోల్చితే రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాది ప్రాంతంలో ఈ సీజన్‌లో పొగాకు సాగు విస్తీర్ణం భారీగా పెరిగిందని, మరోవైపు రాష్ట్రంలో పొగాకు మార్కెట్‌కు దిక్సూచిగా ఉండే కర్ణాటకలో ధరలు బాగున్నా మార్కెట్ మందకొడిగా సాగుతోందని, దాదాపు 40 శాతం వరకు పొగాకు రైతుల వద్దనే ఉన్నందున త్వరగా వేలం నిర్వహించాలనే రైతుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోవాలని ఏలూరు ఎంపీ, టుబాకో బోర్డు సభ్యుడు పుట్టా మహేష్‌కుమార్ పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు. గుంటూరు ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన టుబాకో బోర్డు పాలకవర్గం సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ వర్చువల్ పద్ధతిలో పాల్గొన్నారు. జులై తొలి వారంలో వేలం కేంద్రాలు ప్రారంభించే అంశాన్ని పరిశీలించాలని ఎంపీ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. పొగాకు రైతులు సాగు చేసిన పంట చివరి ఆకు వరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులకు సూచించారు. బోర్డు నిబంధనలు సడలించి వర్జీనియా పొగాకు పంట సాగు రిజిస్ట్రేషన్, బ్యారన్ లైసెన్సుల గడువును ఏడాది నుంచి మూడేళ్లకు పొడిగిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని ఎంపీ సమావేశంలో ప్రస్తావించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పొగాకు రైతులకు ఊరట కలిగిందని, 2025-26 పంట సీజన్ నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిందని ఎంపీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, ఒడిశాల్లోని 83,500 మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ఎంపీ తెలిపారు. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో బోర్డు ఛైర్మన్ సిహెచ్.యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, ఎల్ఆర్ఎస్, డైరెక్టర్ (వేలం) శ్రీనివాసులు, మేనేజర్ (వేలం), కార్యదర్శి డి.వేణుగోపాల్, మేనేజర్ (జిడబ్ల్యుఎఫ్), మేనేజర్ (ఎంకెటిజి ఎగుమతులు), మేనేజర్ (ట్రేడింగ్ వింగ్) బి.మారన్న, ప్రొడక్షన్ మేనేజర్ కెవి.రామాంజనేయులు, విస్తరణ మేనేజర్ జి.దామోదర్, మేనేజర్ (ఫైనాన్స్, అకౌంట్స్) ఎం.రత్నబాయమ్మ, ప్రాంతీయ మేనేజర్ ఎం.లక్ష్మణరావు, రీజనల్ మేనేజర్ (రాజమహేంద్రవరం) జివిఎల్‌కె.ప్రసాద్, రీజనల్ మేనేజర్ (మైసూరు, పెరియపట్నం) హెచ్‌కె.గోపాల్, బోర్డు సభ్యులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు మండలంలోని ఆర్ఆర్.పేట - ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి, సంతోష్‌నగర్ సబ్‌స్టేషన్‌లో ఉన్న 11 కెవి చానిక్యపురి కాలనీ ఫీడర్‌కు చెట్ల నరికివేత, లైన్ మరమ్మతులు చేసేందుకు ఈ నెల 27వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంతోష్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని చానిక్యపురి కాలనీ, ఆర్ఎంఎస్ కాలనీ, డి-మార్ట్ ఏరియా, మోతేవారితోట, మంచి నీళ్ల తోట, మంచెర్ల వారి వీధి, గాంధీ బొమ్మ రోడ్డు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

చింతలపూడిలో పలుచోట్ల..

చింతలపూడి :33/11 కెవి శెట్టివారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి నామవరం ఫీడర్ పరిధిలో అన్ని గ్రామాలకు ఈ నెల 27వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మెయింటెనెన్స్, చెట్ల నరికివేత నిమిత్తం 33 కెవి శంకుచక్రపురం ఫీడర్‌లోని శంకుచక్రపురం సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు 33/11 కెవి చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలోని టౌన్ ఫీడర్‌లోని వెంకట్రామబాగ్, మోడల్ కాలనీ, ఫైర్ స్టేషన్ సెంటర్, బోయగూడెం, ఎస్‌బిఐ నగర్, చార్లెస్ నగర్, తుక్కుల కాలనీ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.


చెక్కులు అందిస్తున్న ఎంఎల్‌ఎ చింతమనేని

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

అనారోగ్య కారణాలతో బాధపడుతున్న పలువురికి సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన సుమారు రూ.ఆరు లక్షల విలువైన చెక్కులను దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అందించారు. స్వయంగా బాధితుల ఇంటి వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను పరామర్శించి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యంతో వారంతా కోరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గాలాయగూడెంలోని అంబటి సుబ్బారావుకు రూ.30 వేల చెక్కును, బెల్లపు వాసుకు రూ.78,988 చెక్కును, రామారావుగూడేనికి చెందిన అరిగెల రామతులసికి రూ.37,292 చెక్కును, ముప్పవరం పంచాయతీ గండివారిగూడేనికి చెందిన షేక్ రహీమ్‌కు రూ.4,25,2500 చెక్కును, కొవ్వలికి చెందని తానింకి రమేష్‌కు రూ.41,625 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు బాధిత కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దస్తావేజులు పోయినవి

మాగంటి వెంకట కనకదుర్గ, W/o.రమేష్‌బాబు అను నాయొక్క ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి. దస్తావేజు నెం.2500/2001 సంబంధిత పట్టాదారు పాస్‌పుస్తకం ఒరిజినల్ తీసుకొని ఏలూరు 1 టౌన్ పెరుగుచెట్టు సెంటర్ ఏరియాలో జిరాక్స్ కాపీలు తీయు నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో ఎక్కడో పడి పోయినవి. కావున సదరు దాఖలు దస్తావేజు నెం.2500/2001 సంబంధిత పట్టాదారు పాసు పుస్తకము ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది ఫోన్‌నెంబర్‌కు తెలియజేయవల్సినదిగా కోరుతున్నాము.

మాగంటి వెంకట కనకదుర్గ,
W/o.రమేష్‌బాబు, సెల్: 9059691846

నోటీసు

మహారాజశ్రీ ఏలూరు అడిషినల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టు
ఇ.ఎ.నెం. 337/2024 ఇన్ ఇ.పి.నెం. 4/2022
ఇన్ ఒ.ఎస్. 271/16

బిట్వీన్:-
సోమిశెట్టి శ్రీనివాసులు ...D.H.R
Vs
యనమంద్ర దుర్గాప్రసాద్ (Died) అండ్ అదర్స్
జె.డి.ఆర్స్/ప్రపోస్డ్ పార్టీలు

R3. యనమంద్ర మహాలక్ష్మి, W/o. దుర్గాప్రసాద్, డోర్ నెం. 11-111, నియర్ శాంతి కాన్వెంట్, కమ్మవారి వీధి, భీమడోలు
R4. యనమంద్ర విష్ణువిశ్వతేజ, S/o. దుర్గాప్రసాద్, డోర్ నెం. 11-111, నియర్ శాంతి కాన్వెంట్, కమ్మవారి వీధి, భీమడోలు
R5. యనమంద్ర లక్ష్మీరాధ వైష్ణవి, D/o. దుర్గాప్రసాద్, డోర్ నెం. 11-111, నియర్ శాంతి కాన్వెంట్, కమ్మవారి వీధి, భీమడోలు

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు నందు మిమ్ములను చనిపోయిన వై. దుర్గాప్రసాద్ తరుపున వారసులుగా చేర్చుమని కోరుచూ పిటీషనర్ పిటిషన్ దాఖలు చేసినిరు. కావున మీరు ది. **09-07-2025**వ సం. తేదిన పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణములను తెలియపరచవలెను. లేని యెడల మీ పరోక్షములో సదరు పిటిషను విచారించబడునని తెలుసుకునేది.

వి.జ్యోత్స్న
ఏలూరు — పిటిషనర్ బై డి.హెచ్.ఆర్
తేది:26-06-2025 — ఏలూరు